ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
10 ఫిబ్రవరి
2025




## పర్యావరణ పరిరక్షణలో...
# "నేను సైతం"

### స్కూల్ విద్యార్థులకు అంతర్జాతీయ ఆన్లైన్ చిత్రలేఖన పోటీ

ఏ దరఖాస్తు చివరి తేదీ మార్చి 15.

ఏ మార్చి 22 విజేతలకు బహుమతులు ప్రదానం.

ఏ ఏప్రియల్ 22 ధరిత్రి దినోత్సవం సందర్భంగా పోటీ విద్యార్థుల చిత్రాలతో "చిల్డ్రన్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్"






హైదరాబాద్, రోమింగ్ న్యూస్: పర్యావరణ పరిరక్షణ పట్ల బాలల్లో మరింత అవగాహన, బాధ్యత పెంచేందుకు ప్రముఖ పర్యావరణ పరిరక్షణ సంస్థ ఈపీడీసీ (ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్మెంట్ కౌన్సిల్ ) పాఠశాల స్థాయి విద్యార్థులకు ఆన్లైన్ చిత్రలేఖన పోటీ నిర్వహిస్తోంది. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం (ఫిబ్రవరి 2 ), ప్రపంచవన్యప్రాణుల దినోత్సవం (మార్చి 3), ప్రపంచ నీటి దినోత్సవం (మార్చి 22) సందర్భాలను పురస్కరించుకొని ఈ పోటీ నిర్వహిస్తున్నట్లు కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీ హెచ్ రంగయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియా తో మాట్లాడారు. పోటీ 2విభాగాల్లో జరుగుతుందని, 13 ఏళ్ళ లోపు విద్యార్థులు జూనియర్, 17 ఏళ్ళ లోపు సీనియర్ విభాగంలో బొమ్మలు వేయాలి. కుటుంబ సభ్యుల సహకారంతో ఇంటివద్దే చిత్రాన్ని గీసి పూర్తి వివరాలతో ఈపీడీసీ websiteలో అప్లోడ్ చెయ్యాలి. పెయింటింగ్ పంపిన 24గంటల్లో విద్యార్థి గీసిన చిత్రం, తన passport సైజు ఫోటోతో కూడిన "పార్టిసిపేషన్ సర్టిఫికెట్ " ఆన్లైన్ లో విద్యార్థికి పంపబడుతుంది. విజేతలను ఎంపిక చేసి మార్చి 22 న నగదు బహుమతి, 'పర్యావరణ బాల వీర సైనిక అవార్డు' ప్రత్యేక సర్టిఫికెట్ ప్రదానం చేయబడుతుంది. తర్వాత పోటీలో పాల్గొన్న విద్యార్థుల చిత్రాలతో ఏప్రియల్-22 (ధరిత్రి దినోత్సవం) 'బాలల పెయింటింగ్ ఎగ్జిబిషన్' ఏర్పాటు చేయబడుతుంది. కాగా విజేతలకు 5వేలు మొదటి బహుమతి, 3వేలు రెండవ బహుమతి, 2వేల రూపాయలు మూడవ బహుమతి ఇవ్వబడును. మరో 20 మంది విద్యార్థులకు కాంసొలేషన్ బహుమతులు ఇవ్వబడును. మానవ మనుగడ పర్యావరణ సమతుల్యత పైనే ఆధారపడి ఉంటుందని, నేడు పర్యావరణం ప్రమాదంలో పడిందని, అది భావితరాలకు ప్రమాదకరం గా మారిందని, రేపటి తరం నేటి బాలలదే కాబట్టి, పర్యావరణ పరిరక్షణ బాధ్యత, అవసరం వారిపై ఎక్కువ ఉందని, అందుకే బాలల్లో అవగాహన పెంచడమే పోటీ ముఖ్య ఉద్దేశమని రంగయ్య తెలిపారు. మరిన్ని వివరాలకు art.epdcindia.com website సందర్శించవచ్చు.

# యాదగిరిగుట్టలో సండే సందడి!!

**ధర్మదర్శనానికి రెండు, స్పెషల్ దర్శనానికి అరగంట సమయం.. ఆదివారం ఆలయానికి రూ.49 లక్షల ఆదాయం**





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. సండే హాలీడే కావడంతో.. హైదరాబాద్ సహా రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు ఎక్కడ చూసినా భక్తులతో సందడిగా కనిపించాయి. స్వామివారి దర్శనం కోసం అధిక సంఖ్యలో భక్తులు రావడంతో.. నారసింహుడి ధర్మదర్శనానికి రెండు గంటలు, స్పెషల్ దర్శనానికి అరగంట సమయం పట్టింది. భక్తుల రద్దీతో లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపాలు, కల్యాణకట్ట, అన్నదాన సత్రం, పార్కింగ్ ప్రదేశం, బస్ బే ఏరియా, దర్శన, ప్రసాద క్యూలైన్లు, క్యూకాంప్లెక్స్, ప్రధానాలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడాయి. ఆలయంలో నిర్వహించిన నారసింహుడి



నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ.49 లక్షల 371 ఆదాయం సమకూరింది. అత్యధికంగా ప్రసాద విక్రయం ద్వారా రూ.18,16,400, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.6.59 లక్షలు, వీఐపీ దర్శనాల ద్వారా రూ.9.30 లక్షలు, బ్రేక్ దర్శనాలతో రూ.3,07,500 ఇన్ కమ్ వచ్చినట్లు ఆలయ ఆఫీసర్లు వెల్లడించారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎండీ మిస్కిన్, శశికుమార్, శ్రీనివాస్, శకుంతల, రమాదేవి, పూర్వ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు






# జనగామలో కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

**సమాచార హక్కు చట్టాన్ని గౌరవించని అధికారులు**

**డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు**

జనగామ, ఫిబ్రవరి 9: (రోమింగ్ న్యూస్) జనగామ జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని ఏమాత్రం గౌరవించకుండా అనేక శాఖలు పనిచేస్తున్నాయని అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలో సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం సమయానుకూలంగా అందించాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా ఆదేశాలు జారీ చేసినప్పటికీ విద్యాశాఖ అధికారులు బే ఖాతర్ చేయడం పట్ల జిల్లా టీచర్స్ యూనియన్ నాయకులు అసహనంతో పాటు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఆదివారం డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డి టి ఎఫ్) జనగామ జిల్లా అధ్యక్షుడు ఇప్ప రాంరెడ్డి

మీడియాతో మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం క్రింద అడిగిన సమాచారాన్ని ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలను ఇచ్చినప్పటికి కూడా పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి రమేష్, ఎ డి జిల్లా విద్యా కార్యాలయం నిర్ణీత సమయంలో స్పందించకుండా కలెక్టర్ ఆదేశాలను బేకాతర్ చేస్తున్నారని, ఆయనపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అధ్యక్షులు రాంరెడ్డి తో పాటు ఉపాధ్యక్షులు బి ఛొక్కయ్య కోరారు. సమాచారహక్కు చట్టం క్రింద సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి సారి పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారిగా నున్న రమేష్, ఎ డి గారు దరఖాస్తు ముట్టలేదని అబద్దలాడుతున్నారని, దరఖాస్తు దారుడు దరఖాస్తు ముట్టినట్లు ఆధారాలు చూపెడితే అసంపూర్తి సమాచారమిచ్చి, తప్పించుక తిరుగుతూ చేతులు దులుపుకుంటున్నారన్నారు. ఈ మధ్య ఒక ఉద్యోగి సెలవులకు సంబంధించిన సమాచారం కోరుతూ దరఖాస్తు పెట్టి 3 నెలలు గడిచి పోయినా సమాచారం ఇవ్వలేదని, మొదటి అప్పిలేట్ అధికారి చెప్పినా, చివరకు జిల్లా కలెక్టర్ గారు సమాచారం ఇవ్వమని ఆదేశించిన పట్టించుకోవడం లేదన్నారు. అడిగిన సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, సమాచార హక్కు చట్టాన్ని నీరుగరుస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, చేస్తామని వారు హెచ్చరించారు . విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నుండి వారికి అందాల్సిన సహాయ సహకారాలను పట్టించుకోకుండా విద్యాశాఖ అధికారులు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని, అర్హతలు లేని వ్యక్తులు విద్యాశాఖలో పని చేస్తూ ప్రభుత్వ విత్తనాలు తీసుకుంటూ, ప్రభుత్వ నియమాలను ఉల్లంఘిస్తూ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాలలో జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# స్కూల్ అమ్మాయిలపై అసభ్య ప్రవర్తన

**స్కూల్ డీన్ తో పాటు ఏజీఎం సస్పెన్షన్**

**కఠిన చర్యలు తీసుకుంటాం...**

**జనగామ జాయింట్ కలెక్టర్ పింకేష్ కుమార్**





జనగామ, ఫిబ్రవరి 9: (రోమింగ్ న్యూస్) జనగామ జిల్లా కేంద్రంలోని ఒక స్కూల్లో అధ్యాపకుడు స్కూల్ అమ్మాయిలపై అసభ్యకరంగా మాట్లాడుతూ, తన ప్రవర్తన తో ఇబ్బందులు కలిగిస్తున్నాడని ఆరోపణలు వస్తున్నాయి. ఈ మేరకు స్కూల్ అమ్మాయిలతో పాటు వారి తల్లిదండ్రులు ఆరోపిస్తూ ఫిర్యాదును అందజేశారని దాంతో నిజానిజాలు పరిశీలించడానికి విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాలకు చేరుకున్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలలో అమ్మాయిలపై అరాచకం సహించలేని నేరం అంటూ ఎన్ ఎస్ యు ఐ జనగామ జిల్లా అధ్యక్షులు చిలువేరు అభి గౌడ్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు . వివరాల్లోకి వెళ్తే జనగామలోని చైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్నదని చెప్పుకుంటూ ఉన్న స్థానిక వైష్ణవి హైస్కూల్ పాఠశాలలో ఒక ఉన్నతమైన స్థానంలో ఉన్న డీన్, పదవ తరగతి చదువుతున్న విద్యార్థినిలపై అసభ్యకరంగా ప్రవరిస్తున్నారని ఆరోపించారు. క్లాస్ రూమ్ లో ఉన్న



అమ్మాయిలందరు అదే సమస్యను ఫేస్ చేయడం పట్ల విద్యార్థిత్ నాయకులు ఆశ్చర్యంతో పాటు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పాఠశాలలో సిబ్బందిని నిలదీయడంతో తలెత్తిన ఉద్రిక్త పరిస్థితిని తెలుసుకొని జనగామ ఎస్ఐ రాజేష్ తో పాటు, జిల్లా జాయింట్ కలెక్టర్ పింకేష్ కుమార్, ఇతర విద్యాశాఖ అధికారులు అక్కడికి చేరుకొని పరిస్థితి చేజారి పోకుండా జరిగిన వాస్తవాలను సేకరించారు. జరిగిన సంఘటనలలో నిజా నిజాలు ఎలా ఉన్నా విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న టీచర్ తో పాటు పాఠశాల మేనేజర్ ను కూడా వెంటనే సస్పెండ్ చేస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించడంతో పరిస్థితి శాంత పడినట్లు తెలిసింది.

ఈ విషయంలో పూర్తి వివరాలు సేకరించి కఠిన చర్యలు తీసుకుంటామని జనగామ జిల్లా జాయింట్ కలెక్టర్ పింకేష్ కుమార్ పేర్కొన్నారు. ఇలాంటి సంస్కృతికి మద్దతు తెలుపుతున్న శ్రీ చైతన్య లాంటి విద్యా సంస్థల పనితీరు మారకపోతే విద్యార్థి సంఘాల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని ఎన్ .ఎస్. యు. ఐ. జిల్లా అధ్యక్షుడు అభి గౌడ్ హెచ్చరించారు. ఆయనతోపాటు ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్మభిక్షం మరియు విద్యార్థి నాయకులు కార్తీక్, సతీష్ పలువురు పాల్గొన్నారు.

